RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక



రిటైర్మెంట్ ప్రకటించిన టీమిండియా క్రికెటర్ 5

ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్ | మంగళవారం 5 నవంబర్ 2024 | సంపుటి : 12 | సంచిక : 289 | పేజీలు : 8 | వెల : 4/-

## రేషన్ కార్డు లేకపోయినా ఇందిరమ్మ ఇల్లు

### రెండో విడుత నుంచి రేషన్ కార్డు ఉంటేనే అర్హులు

- త్వరలోనే రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ షురూ
- పంచాయతీ కార్యదర్శులు స్థానికంగానే ఉండాలి
- పనిలో నిర్లక్ష్యం వహించే వారిపై వేటు వేయండి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం



**కూసుమంచి, నవంబర్ 4 :** రేషన్ కార్డు లేకపోయినా, మొదటి విడుతలో పేదో ళ్లు, బహు పేదోళ్లు.. ఇలా కేటగిరిల వారీగా పరిశీలించి, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నామని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. త్వరలోనే రేషన్ కార్డుల జారీ ప్రక్రియ మొదలవు తుందని పేర్కొన్నారు. రెండో విడత నుంచి రేషన్ కార్డు ఉంటేనే ఇందిరమ్మ ఇళ్లు పొందేందుకు అర్హులవుతారని స్పష్టం చేశారు. కూసుమంచిలోని ఎమ్మె ల్యే క్యాంపు కార్యాలయంలో తిరుమలా యపాలెం మండలంలోని అన్ని గ్రామా ల ముఖ్య నాయకులు, ముఖ్య కార్యక ర్తలతో మంత్రి మిగతా 2 లో



## విద్యార్థులు తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి

### గత పదేళ్లలో విద్యావ్యవస్థ నిర్లక్ష్యానికి గురైంది

చదువు, సామాజిక స్పృహతోనే హీరోలవుతారు

రాజకీయ పార్టీల రెచ్చగొట్టే ప్రకటనలను నమ్మవద్దు

విద్యార్థులతో సీఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్



**హైదరాబాద్, నవంబర్ 4 :** 'విద్యార్థులు తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నిరుద్యోగులు, విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని, రాజకీయ పార్టీల రెచ్చగొట్టే ప్రకటనలను నమ్మవద్దని పిలుపునిచ్చారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు సోమవారం జూబ్లీహిల్స్‌లో ముఖ్యమంత్రిని కలిశారు. మిగతా 2 లో

### ధాన్యం కొనుగోళ్లు సాఫీగా సాగాలి

- ఎక్కడికక్కడే సమస్యలు పరిష్కరించాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు

కేసీఆర్ నుంచి రికవరీ చేసే

### దమ్ముందా?

- "సమగ్ర కుటుంబ సర్వే" నివేదిక ఏమైంది?
- ప్రభుత్వం ఎందుకు బయటపెట్టడం లేదు?
- మళ్లీ కులగణన పేరుతో హడావుడి ఎందుకు?
- బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



3 లో

గ్యారంటీలు, డిక్లరేషన్లు

### ఏమయ్యాయి?

- కాంగ్రెస్‌పాలనకు ఏడాది ముగుస్తుంది
- ఆచరణకు సాధ్యంకాని హామీలు ఇచ్చింది
- గారడీలతో ప్రజలను మోసం చేస్తున్నది
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నల వర్షం



3 లో

## పెండింగ్ బిల్లుల కోసం చలో హైదరాబాద్

- ఎక్కడికక్కడే మాజీ సర్పంచ్‌ల అరెస్ట్
- మద్దతుగా బిఆర్ఎస్ నేతల ఆందోళన
- హరీష్ రావు తదితరుల అరెస్ట్
- అరెస్ట్‌లను ఖండించిన కేటీఆర్



**హైదరాబాద్, నవంబర్ 4 :** పెండింగ్ బిల్లులు విడుదల చేయాలంటూ తెలంగాణలో మాజీ సర్పంచులు పోరుబాట పట్టారు. సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చేందుకు హైదరాబాద్ చేరుకుని ఓ హోటల్‌లో సమావేశమ య్యారు. అనంతరం హోటల్ బయటకు వచ్చిన వారిని పోలీసు లు అరెస్టు చేశారు. ఛలో హైదరా బాద్‌కు పిలుపునిచ్చారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టిన వారిని ఎక్కడికక్కడ పోలీసులు అరెస్ట్ మిగతా 4 లో

## మార్చిలోపు బకాయిలు



- మాజీ సర్పంచులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- మీకు మా ప్రభుత్వం అండగా ఉంటుంది
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి
- నాడు సర్పంచులను మోసం చేసి, నేడు వారితో కలిసి ధర్నాలు.. బీఆర్ఎస్‌పై మంత్రి ఫైర్

4 లో

ఏడాదికి ఇక మిగిలింది

### 35 రోజులే

- ప్రజాపాలనలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయి
- రాహుల్ సమాధానం చెప్పాలన్న కేటీఆర్

4 లో





## సీఎంకు బీసీ సంఘాల కృతజ్ఞతలు

2 లో

## బాణాసంచా నిషేధాన్ని ఎందుకు అమలు చేయలేదు

### ఢిల్లీ సర్కారుపై సుప్రీంకోర్టు ఆగ్రహం



**న్యూఢిల్లీ, నవంబర్ 4 :** ఢిల్లీలో వాయు కాలుష్యం పెరగడంపై ఢిల్లీ సర్కారుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పత్రికల్లో వస్తున్న వార్తలను చూస్తే.. ఢిల్లీలో బాణాసంచా నిషేధం అమలు కాలేదని అనిపిస్తోందని పేర్కొంది. ఇందుకు సంబంధించి సమాధానం చెప్పాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. బాణాసంచా నిషేధంపై ఢిల్లీ ప్రభుత్వం కీలక చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. మిగతా 2 లో

## తగ్గిన బంగారం ధర..

### 95 వేల దిగువకు వెండి



**న్యూఢిల్లీ, నవంబర్ 4 :** పండగలు, వివాహాది శుభకార్యాల నేపథ్యంలో ఇటీవల వరుసగా దూసుకెళ్లిన బంగారం, వెండి ధరలు సోమవారం కాస్త తగ్గుముఖం పట్టాయి. దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1300 మేర తగ్గి రూ.81,100కు చేరినట్లు ఆలిండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పుత్తడి ధర గురువారం గరిష్ఠంగా రూ.82,400 మేర పలికిన సంగతి తెలిసిందే. మిగతా 3 లో

# బాణాసంచా నిషేధాన్ని ఎందుకు అమలు చేయలేదు

మొదటి పేజీ తరువాయి



దీపావళి నుంచి ఢిల్లీ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగింది. దాంతో జనం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శ్వాసకోశ సమస్యలు, కళ్లు ఎర్రబారడం, చికాకు తదితర సమస్యలతో బాధపడుతున్నారు. ప్రస్తుతం నగరంలోని చాలా ప్రాంతంలో గాలి నాణ్యత సూచి 400 మార్క్‌ని దాటింది. పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని డిసెంబర్ 2, 2016న ఎంసీ మెహతా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పును ఇచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాల మే-రకు ఢిల్లీలో గ్రాప్ పాలసీని అమలులోకి తీసుకువ చ్చారు. చలికాలంలో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ఇందులో పలు నిబంధనలు ఉన్నాయి. ఇందులో బాణాసంచాపై నిషేధం సైతం ఉన్నది. వాయు కాలుష్యంపై ఢిల్లీ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు సోమవారం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. బాణాసంచా నిషేధాన్ని ఎందుకు అమలు చేయడం లేదని సుప్రీంకోర్టు ప్రభు త్వాన్ని ప్రశ్నించింది. నిషేధం ఉంటే పటాకులు ఎలా పేల్చారు? వీలైనంత త్వరగా సమాధానం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. దేశ రాజధాని ఢిల్లీలో వాయుకాలుష్యం పెరిగిపో వడంతో మార్నింగ్ వాక్ చేయడం మానేస్తున్నట్లు సీజేఐ చంద్ర చూడ్ గురువారం వ్యాఖ్యానించారు. శ్వాసకోశ వ్యాధులను నివా రించడానికి ఇంట్లోనే ఉండటమే మంచిదని, ఉదయాన్నే బయ టకు వెళ్లకుండా ఉండాలని డాక్టర్ సలహా ఇచ్చారన్న ఆయన.. వాయుకాలుష్యం పెరుగుతుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

# ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

## 14 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల తేదీల్లో మార్పు




**న్యూఢిల్లీ, నవంబర్ 4 :** ఎన్నికల సంఘం కీలక నిర్ణయం ప్రకటించింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల పై కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 13వ తేదీన పలు అసెంబ్లీ స్థానాలకు జరగాల్సిన ఉప ఎన్నికల తేదీల్లో కీలక మార్పు చేసింది. మొత్తం మూడు రాష్ట్రాల్లోని పలు అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికలను వారం రోజులపాటూ వాయిదా వేసింది. కేరళ , పంజాబ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో 14 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 13న ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈసీ గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఆరోజున పలు మతపరమైన కార్యక్రమాల కారణంగా బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, ఆర్జేడీ సహా పలు రాజకీయ పార్టీలు పోలింగ్‌ను వాయిదా వేయాలని ఈసీని కోరాయి. సాంస్కృతిక, మతపరమైన కార్యక్రమాల కారణంగా ఓటింగ్ శాతం తగ్గే అవకాశం ఉందని రాజకీయ పార్టీలు ఈసీ దృష్టికి తీసుకెళ్లాయి. వారి అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈసీ ప్రకటించింది. నవంబర్ 13న జరగాల్సిన ఉప ఎన్నికల పోలింగ్‌ను నవంబర్ 20కి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. ప్రభావితమైన 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేరళలోని పాలక్కాడ్, పంజాబ్‌లోని డేరా బాబా నానక్, చబ్బేవాల్, గిద్దర్ బాహా, బర్నాల్, యూపీలోని ఖైర్, మీరాపూర్, కుందర్కి, ఘజియాబాద్, కర్హాల్, సిషామౌ, ఫుల్‌పూర్, కతేహరి, మజావాన్ ఉన్నాయి. అయితే, ఆయా నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపులో మాత్రం ఎలాంటి మార్పూ చేయలేదు.



# తెలంగాణలో బీసీ కమిషన్ ఏర్పాటు

## మాజీ ఐఎఎస్ ఛైర్మన్‌గా ఉత్తర్వులు.. నెలరోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం

**హైదరాబాద్, నవంబర్ 4 :** స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసింది. రిటైర్డ్ ఐఏఎస్ బూసాని వెంకటేశ్వర రావును ప్రభుత్వం ప్రత్యేక కమిషన్‌కు ఛైర్మన్‌గా నియమించింది. సెక్రటరీగా ఐఎఫ్ఎస్ అధికారి బి.సైదులును నియమించింది. హైకోర్టు ఆదేశాలతో ప్రభుత్వం ఈ కమిషన్ ను ఏర్పాటు చేసింది. రిజర్వేషన్లపై అధ్యయనం చేసి నెల రోజుల లోపు నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. హైకోర్టు ఇచ్చిన తీర్పును పరిగణనలోకి తీసుకొని ముందుకు వెళ్లాలని ఇప్పటికే సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ఇదే అంశంపై ఆదివారం మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, ఉన్నతాధికారులతో జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి సమాలోచనలు జరిపారు. కులగణన, స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలో ఇటీవల హైకోర్టు లేవనెత్తిన అంశాలను సమీక్షించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 340, సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం రాజకీయాల్లో బీసీ రిజర్వేషన్ల కల్పన కోసం బీసీల జనాభా లెక్కలు తీసేందుకు ప్రత్యేక కమిషన్ ఉండాలని హైకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్రంలో ఈ నెల 6 నుంచి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల సర్వే ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు, న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఉండేందుకు కోర్టు తీర్పులను తప్పకుండా అనుసరించాలని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

**హైదరాబాద్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్‌కు విశ్రాంత ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వరరావు ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నెల రోజుల్లోగా దీనిపై నివేదిక అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. హైకోర్టు ఆదేశాల మేరకే కమిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

# రేషన్ కార్డు లేకపోయినా ఇల్లు

మొదటి పేజీ తరువాయి

మంత్రి పొంగులేటి సోమవారం సమావేశమయ్యారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న తాజా పరిస్థితులపై సంబంధిత అధికారులు, నాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సమీక్ష అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... ఏ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆ గ్రామంలోనే నివాసం ఉండాలని, అప్పుడే స్థానిక స్థితిగతు లపై పట్టుకలిగి ఉంటారని పేర్కొన్నారు. గతంలోనూ ఈ విషయాన్ని చెప్పినట్లు గుర్తు చేశారు. వీలైనంత త్వరగా వారు పనిచేస్తున్న గ్రామంలోనే నివాసం ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. గ్రామ కార్యదర్శులపై ఎంపీడీవోల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. పనుల్లో నిర్లక్ష్యం వహించే కార్యదర్శులపై నిర్ధాక్షణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## 4 దశల్లో రూ.5 లక్షలు లబ్ధిదారులకు అందజేత

**ఖమ్మం, నవంబర్ 4:** అర్హులైన పేదలకు పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం మంత్రి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్‌పీ శ్రీజతో కలిసి ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ పరిధి 59వ డివిజన్ దానవాయిగూడెంలో పర్యటించారు. ఎస్డీఆర్ఎఫ్‌నిధులు 25 లక్షలతో చేపట్టిన సీసీ కాల్వల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, గడిచిన 10 ఏండ్లలో ఆనాటి ప్రభుత్వం పేదవాడికి ఇళ్ల అంశం ఎన్నికల సమయంలో మాత్రమే ఊహాజనిత చిత్రాలు మీడియాలో చూపిస్తూ కాలం గడిపిందని, మార్పు కావాలని అది ఇందిరమ్మ రాజ్యంతోనే సాధ్యమని ప్రజలు ప్రజా ప్రభుత్వం ఎన్నుకొని 11 నెలలు కావస్తుందని అన్నారు. గతంలో కాంగ్రెస్ పరిపాలించిన సమయంలో ఉమ్మడి రాష్ట్రంలోని తెలంగాణ పది జిల్లాల పరిధిలో 19 లక్షల 56 వేల ఇళ్లను వైఎస్ చేతుల మీదుగా పేదలకు కట్టి ఇచ్చారని గుర్తు చేశారు. అదే విధంగా నేడు పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా ప్రతి గ్రామంలో బహు

పేదవారికి గ్రామసభల ద్వారా పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరిట మంజూరు చేస్తామని, 400 చదరపు అడుగులతో ఇల్లు నిర్మిస్తామని అన్నారు. ప్రభుత్వ సహాయాన్ని నాలుగు దశలలో పునాది వేసినప్పుడు లక్ష రూపాయలు , లెంటల్ లెవెల్ లో లక్షా 25 వేల రూపాయలు, స్లాబ్ దగ్గర ఒక లక్షా 75 వేలు, గృహప్రవేశం సమయానికి మరో లక్ష రూపాయలు లబ్ధిదారులకు నేరుగా అందించడం జరుగుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధుల విడుదల ఉ ంటుందని, నవంబర్ నెలాఖరు నాటికి అర్హుల జాబితా తయారు చేయడం జరుగుతుందని, రాబోయే నాలుగు సంవత్సరాలలో 20 లక్షల ఇళ్లకు తగ్గకుండా నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. సాంకేతికతను వినియోగిస్తూ ప్రత్యేక యాప్ ద్వారా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పర్యవేక్షిస్తామని అన్నారు. నవంబర్ 20 తరువాత గ్రామసభల ద్వారా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభిస్తుందని, అదే విధంగా గతంలో ప్రారంభించి పూర్తి కాని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి కరెంటు, త్రాగునీరు, వంటి మౌళిక వసతులు కల్పించి లబ్ధిదారులకు కేటాయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో నర్సింహా రావు, మునిసిపల్ కార్పొరేషన్ ఇఇ కృష్ణలాల్, డిఇ మాధవి దేవి, ఏఇ కుమారస్వామి, శానిటరీ సూపర్వైజర్ సాంబయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి



**హైదరాబాద్, నవంబర్4:** రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసేందుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఉమ్మడి జిల్లాకో ఐఏఎస్‌ను ప్రత్యేక అధికారిగా నియమించింది. రైతులకు ఇబ్బంది తలెత్తకుండా అన్ని జిల్లాల్లో కొనుగోళ్లు చేపట్టాలని, ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కొనుగోళ్లు జరుగుతున్న తీరును పరిశీలించి, ఏమైనా సమస్యలుంటే అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు.

### ప్రత్యేకాధికారులు వీరే..

- ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు కృష్ణ ఆదిత్య
- కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు ఆర్వీ కర్ణన్,
- నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేటకు అనితా రామచంద్రన్
- నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు డాక్టర్ శరత్
- రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలకు డీ దివ్య,
- మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నాగర్‌కర్నూల్ జిల్లాలకు రవి,
- వరంగల్, హనుమకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాలకు టీ వినయ కృష్ణ రెడ్డి
- మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు హరిచందన దాసరి
- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు కే సురేంద్ర మోహన్



# విద్యార్థులు తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ వసతిగృహాలు, గురుకులాల్లో డైట్, కాస్మెటిక్ ఛార్జీలను పెంచినందుకు "థాంక్యూ సీఎం సర్..." అంటూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మంచిర్యాలలో తమకు సొంత హాస్టల్ భవనం నిర్మించాలని విద్యార్థులు కోరగా... స్థానిక అధికారులతో స్థలసేకరణ చేయించి భవనం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. "గత పదేళ్లలో విద్యావ్యవస్థ నిర్లక్ష్యానికి గురైతే... మా ప్రభుత్వం మార్పులు చేసింది. స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నాం. ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తున్నాం. స్పోర్ట్స్ యూనివర్సిటీని సైతం స్థాపించనున్నాం. యువజన సంఘాలు బడిబయట ఉన్న విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేలా చొరవ చూపాలి. యువత విద్యను నిర్లక్ష్యం చేయొద్దు. మత్తుపదార్థాల బారిన పడొద్దు. పాఠశాలల్లో విద్యతోపాటు సామాజిక అవగాహన కల్పించేలా ఉపాధ్యాయులు బృంద చర్చలు నిర్వహించాలి. 'రాష్ట్రంలోని విద్యార్థులంతా బాగా చదువుకోవడంతోపాటు సామాజిక స్పృహను పెంచుకోవాలి. చదువుకుంటే ప్రయోజకులవుతారు. సామాజిక స్పృహతో సమాజానికి సేవ చేస్తే హీరోలు అవుతారు' అని సూచించారు.

### ధాన్యం కొనుగోళ్లు సాఫీగా సాగాలి

హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సీఎంవో ఓ ప్రకటనలో వెల్లడించింది. రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని జిల్లాల్లో కొనుగోళ్లు చేపట్టాలని, ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని సీఎం ఆదేశించారు. కొనుగోళ్లు జరుగుతున్న తీరును పరిశీలించి, ఏమైనా సమస్యలుంటే అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకో ఐఏఎస్‌ను ప్రత్యేక అధికారిగా నియమించింది.



# సీఎంకు బీసీ సంఘాల కృతజ్ఞతలు

**హైదరాబాద్, నవంబర్4:** న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు అమలయ్యేందుకు వీలుగా డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసినందుకుగాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీసీ సంఘాలు కృతజ్ఞతలు తెలియజేశాయి. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఫిషర్ మెన్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయి కుమార్, బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ వీ కృష్ణమోహన్ రావు, బీసీ సంఘాలకు చెందిన ఇతర నేతలు సోమవారం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని సీఎంతో ఆర్ కృష్ణయ్య, బీసీ సంఘం నేతలు అన్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని, ఆ ప్రక్రియలోనే డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు.

# టెట్ నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్, నవంబర్ 4 :** తెలంగాణ టెట్ నోటిఫికేషన్ విడుదలైంది. పాఠశాల విద్యాశాఖ ఈమేరకు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. నవంబర్ 5 వ తేదీ నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం కల్పించారు. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నారు. పూర్తి వివరాల కోసం రేపటి నుంచి వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చు. కాగా, ఈ ఏడాది మే 20వ తేదీ నుంచి జూన్ 2వ వరకు ఆన్‌లైన్‌లో టెట్ పరీక్షలు నిర్వహించి ఇప్పటికే ఫలితాలు విడుదల చేసిన సంగతి తెలిసిందే. కాగా ఈ ఏడాది ఇది రెండో నోటిఫికేషన్ కావడం గమనార్హం.

# మెదక్‌లో ప్రేమోన్మాది ఘాతుకం

**మెదక్, నవంబర్4:** మెదక్ జిల్లాలో ప్రేమోన్మాది రెచ్చిపోయాడు. తనను ప్రేమించడంలేదని యువతిపై దారుణానికి తెగబడ్డాడు. కత్తితో దాడిచేసి యువతిని తీవ్రంగా గాయపరిచి పరారయ్యాడు. తీవ్ర గాయాలపాలైన యువతిని చికిత్సకోసం ఆస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళితే.. సోమవారం డిగ్రీ విద్యార్థిని దివ్యవాణి ఓపెన్ డిగ్రీ పరీక్షలు రాయడానికి పట్టణంలోని ప్రభుత్వ కాలేజీకి వచ్చిన యువతిపై బెంగుళూరుకు చెందిన చేతన్ అనే యువకుడు ఒక్కసారిగా కత్తితో దాడి చేశాడు. అతని నుంచి తప్పించుకోవడంతో ఆమె గాయాలతో బయటపడింది. యువతి చేతికి తీవ్ర గాయాలు కావడం గమనించిన స్థానికులు చికిత్స కోసం వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దాంతో కుటుంబ సభ్యులు వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుడు చేతన్ అప్పటికే అక్కడి నుంచి పరార్ అయ్యాడు. ప్రస్తుతం అతని కోసం పోలీసులు వెతుకుతున్నారు. అయితే గత ఆరు నెలలుగా చైతన్య ప్రేమ పేరుతో వెంటబడుతున్నట్లు బాధిత విద్యార్థిని పోలీసులకు వాగ్మూలం ఇచ్చింది.

# మిగ్-29 ఫైటర్ జెట్ క్రాష్

**ఆగ్రా,నవంబర్ 4 :** ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా సమీపంలో మిగ్-29 యుద్ధ విమానం సోమవారంనాడు కుప్పకూలింది. అయితే విమానంలోని ఇద్దరు పైలట్లు సురక్షితంగా బయటపడ్డారు. వైమానిక విన్యాసాల కోసం ఫైటర్ జెట్ పంజాబ్‌లోని అదంపూర్ నుంచి ఆగ్రా వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. విమానం కుప్పకూలిన వెంటనే పెద్దఎత్తున మంటలు చెలరేగా యి. ఈ ఘటనపై విచారణ ఆదేశించినట్టు రక్షణ శాఖ అధికారులు తెలిపారు. విమానం కుప్పకూలడానికి కొద్ది ముందే పైలెట్ల్ ఇద్దరూ విమానం నుంచి దూకేయడంతో సురక్షితంగా బయటపడినట్టు అధికారిక వర్గాలు తెలిపాయి. కగారోల్ లోని సోనిగ గ్రామం సమీపంలోని పొలాల మధ్యలో జెట్ కూలగడంతో ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. విమానం నేలకు తాగగానే ముక్కచెక్కలైందని, మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయని స్థానికులు తెలిపారు.

# కేసీఆర్ నుంచి రికవరీ చేసే దమ్ముందా?!

- అసలు "సమగ్ర కుటుంబ సర్వే" నివేదిక ఏమైంది?
- కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు బయటపెట్టడం లేదు?
- కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



**కరీంనగర్, నవంబర్ 4:** దేశ, విదేశాల్లో ఉన్న ప్రజలను ఉన్న ఫలంగా రప్పించి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో యుద్ధ ప్రాతిపదికన నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే నివేదిక ఏమైందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వరదవెల్లి గ్రామ దేవత పోచమ్మ తల్లిని బండి దర్శించుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌తో కలిసి బోట్ సేవలను ప్రారంభించారు. కలెక్టర్ తోపాటు స్వయంగా బోట్‌లో వెళ్లి దత్తాత్రేయ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బోట్ సేవలు అందుబాటులోకి రావడంవల్ల ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని చెప్పారు. అందరూ దత్తాత్రేయ స్వామిని దర్శించుకోవడంతోపాటు ప్రతి ఒక్కరూ దత్తాత్రేయ స్వామి ఉత్సవాల్లో సంతోషంగా పాల్గొనే అవకాశం లభించిందన్నారు. వడ్ల కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వహిస్తున్న నిర్లక్ష్య ధోరణితో రైతులు రోడ్లపై వడ్ల రాశులు పోసి, అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కుల గణనపై మీడియా అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ తనదైన శైలిలో స్పందించారు. సమగ్ర కుటుంబ సర్వేలో కులం, మతం, ఆదాయం, ఆస్తిపాస్తుల వివరాలన్నీ నమోదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. "ఎన్నేళ్లు ఉన్నా కులమైతే మారదు కదా? మళ్లీ కులగణన పేరుతో ఈ హడావుడి ఎందుకు? అసలు సమగ్ర కుటుంబ సర్వే నివేదికను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు బయటపెట్టడం లేదో సమాధానం చెప్పాలి" అని డిమాండ్ చేశారు. వందల కోట్ల ఖర్చు పెట్టి ప్రజలను ఇబ్బంది పెట్టి చేసిన ఆ సర్వే నివేదిక ఏమైందని, ఒకవేళ ఆ వివరాలు లేకపోతే... దానికోసం ఖర్చుపెట్టిన సొమ్మును కేసీఆర్ కుటుంబం నుండి రికవరీ చేయించాలని డిమాండ్‌చేశారు. ఆ దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందా? అని సవాల్‌చేశారు.




## తగ్గిన బంగారం ధర..
### 95 వేల దిగువకు వెండి

(మొదటిపేజీ తరువాయి)

ఇటీవల కాలం లక్ష రూపాయల మార్కు దాటిన కిలో వెండి ధర సైతం దిగొచ్చింది. గురువారం రూ.99,500 పలకగా.. దిల్లీలో సోమవారం దీని ధర రూ.4600 తగ్గి రూ.94,900కు చేరింది. బంగారం వర్తకులు, రిటైలర్ల నుంచి ఆశించిన మేర డిమాండ్ లేకపోవడంతో బంగారం, వెండి ధరల తగ్గుముఖం పట్టడానికి కారణమని అనలిస్టులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా బంగారం ఔన్సు 2740 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. వెండి ఔన్సు 32.80 డాలర్లుగా ఉంది. నవంబర్ 5న అమెరికా అధ్యక్ష ఎన్నికలు, 7న ఫెడరల్ రిజర్వ్ 7న వడ్డీ రేట్ల ప్రకటన వంటి ప్రధాన ఈవెంట్లు ఈ వారంలో ఉన్నాయి. ప్రస్తుతం ఒపీనియన్ పోల్స్ ప్రకారం రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్, డెమోక్రాట్ అభ్యర్థి కమలా హ్యారిస్ మధ్య పోటాపోటీ నెలకొంది. మరో వైపు ఫెడ్ ఈ వారంలో 25 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ తగ్గించొచ్చని భావిస్తున్నారు. ఈ రెండు అంశాలు ఈ వారం బంగారం ధరలను దిశా నిర్దేశం చేయొచ్చని అనలిస్టులు చెబుతున్నారు. చైనా కూడా ఈ వారంలో ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించే అవకాశం ఉండడంతో ఇది కూడా అంతర్జాతీయంగా బంగారం ధరలను ప్రభావితం చేయొచ్చని భావిస్తున్నారు.

## 24 గంటల కరెంట్ ఘనత కేసీఆర్‌దే

- తప్పుదోవ పట్టించేలా కాంగ్రెస్ ప్రచారం
- మండిపడ్డ మాజీమంత్రి హరీష్ రావు



**హైదరాబాద్, నవంబర్ 4:** 24 గంటల కరెంటు విషయంలో దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్న జాతీయ కాంగ్రెస్ వైఖరిపై సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నవ్విపోదురు గాక, నాకేం సిగ్గు అన్నట్టుంది కాంగ్రెస్ పార్టీ తీరు ఉన్నదని ఎద్దేవా చేశారు. దేశంలో రైతులకు 24 గంటల ఉచిత కరెంటును అందించిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణను నిలిపింది బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ అని చెప్పారు. 2018, జనవరి 1 నుంచే రాష్ట్రంలో అన్నదాతలకు 24 గంటల ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. కానీ, ఆ ఘనత కూడా తమదేనంటూ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని విమర్శిచారు. గతంలో రైతులకు 24 గంటల ఉచిత కరెంటు దండగ అని, మూడు గంటల కరెంటు సరిపోతుందని రైతు వ్యతిరేక వైఖరిని ప్రకటించిన చరిత్ర రేవంత్ రెడ్డిది, కాంగ్రెస్ పార్టీదని మండిపడ్డారు. ఇప్పుడేమో ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో ఓట్ల కోసం కేసీఆర్ అందించిన 24 గంటల ఉచిత కరెంటు ఘనతను తమ ఖాతాలో వేసుకుంటూ దేశవ్యాప్తంగా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు విమర్శించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సాధించిన అభివృద్ధిని చూపించుకునే ముఖం లేక, తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ సాధించిన అభివృద్ధిని చూపించి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరికి, మోసపూరిత విధానానికి మరో నిదర్శనమని చెప్పారు.

## మాజీ సర్పంచ్‌ల అరెస్ట్ అప్రజాస్వామికం : బండి



**హైదరాబాద్, నవంబర్ 4:** పెండింగ్ బిల్లుల కోసం ఆందోళన చేపట్టిన మాజీ సర్పంచులను అరెస్ట్ చేయడం దుర్మార్గమైన చర్య అని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే పెండింగ్ బిల్లులన్నీ చెల్లిస్తామని చెప్పిన కాంగ్రెస్ మాట తప్పిందని విమర్శించారు. సమస్యను వరిష్కరించకుండా పోలీసులతో ఆందోళనలను అణదొక్కాలని చూడటం అవివేకమన్నారు. అరెస్ట్ చేసిన సర్పంచ్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సర్పంచ్‌లు అప్పుల పాలవడానికి కారకులు భారాస, కాంగ్రెస్ పార్టీలేనన్నారు. అధికారంలోకి రాగానే పెండింగ్ బిల్లులన్నీ చెల్లిస్తామని చెప్పిన కాంగ్రెస్.. మాట తప్పిందని విమర్శించారు. ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఇవ్వాలని విన్నవించినా చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. సమస్యను పరిష్కరించకుండా పోలీసులతో అణగదొక్కాలని చూస్తారా? అని మండిపడ్డారు. కాంగ్రెస్, భారాస పార్టీలకు మాజీ సర్పంచ్ కుంటుంబాల ఉసురు తగులుతుందన్నారు. అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లయిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. యూఎస్‌కు చెందిన 'ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ భాజపా' ఎన్ఆర్ఐ నేతలతో ఆయన దృశ్యమాధ్యమం ద్వారా సమావేశమయ్యారు. అతి తక్కువ కాలంలో కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత నెలకొందని, రాష్ట్రంలో సీఎం హామీలకు విలువ లేకుండా పోయిందన్నారు. దక్షిణాదికి అన్యాయం పేరుతో ఆ పార్టీ దుష్ప్రచారం చేస్తోందని, మీడియా ప్రచారం తప్ప ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. భారాస పనైపోయిందని, ఆ పార్టీలో క్యాడర్ లేరన్నారు. ఆ పార్టీలో కొంతమంది నేతలు అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. 2028 ఎన్నికల్లో తెలంగాణలో భాజపా అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఆదాయం కోసం కాకుండా ఆలయాల్లో ప్రజలకు సేవలందిస్తామని, హిందూ ధర్మం, ప్రజల ఆలోచనలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కనీసం ఐదుగురు విదేశీయులను భారత్‌లో పర్యటించేలా కృషి చేయాలని ఎన్నారైలకు ఆయన సూచించారు. దేశాభివృద్ధి కోసం తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని కోరారు.

## హయత్‌నగర్‌లో విషాదం
### స్కూల్ గేటు మీద పడి విద్యార్థి మృతి

**హయత్‌నగర్, నవంబర్4 :** రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో విషాదం చోటుచేసుకుంది. హయత్‌నగర్‌లోని జిల్లా పరిషత్ హై స్కూలులో సోమవారం సాయంత్రం పాఠశాల గేటు విరిగి ఒకటో తరగతి విద్యార్థిపై పడింది. ఈ ప్రమాదంలో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. దాదాపు 4 గంటల సమయంలో పాఠశాల ప్రధాన గేటుతో బాలుడు ఆడుకుంటున్నాడు. అదే సమయంలో మరికొందరు చిన్నారులు గేటు ఎక్కి అటూ ఇటూ ఊగుతున్నారు. ఈ క్రమంలో గేటు వెల్డింగ్ జాయింట్లు ఊడిపోయి మీద పడడంతో బాలుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకొని చిన్నారిని వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన అక్కడి వైద్యులు.. అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. బాలుడు స్థానిక ముదిరాజ్ కాలనీకి చెందిన విద్యార్థిగా పోలీసులు గుర్తించారు.

## గ్యారంటీలు, డిక్లరేషన్లు ఏమయ్యాయి?

- కాంగ్రెస్‌పాలనకు ఏడాది ముగుస్తుంది
- ఆచరణకు సాధ్యంకాని హామీలు ఇచ్చింది
- గారడీలతో ప్రజలను మోసం చేస్తున్నది
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నల వర్షం



**హైదరాబాద్, నవంబర్4:** కాంగ్రెస్ ప్రజలను గారడీలతో మోసం చేసేందుకు ప్రయత్నం చేస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. విద్యానగర్ జామై ఉస్మానియా పాఠశాలకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బెంచీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయన్నారు. తెలంగాణలో ఆరు గ్యారెంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామ న్నారు.. ఏడాది ముగుస్తుంది గ్యారంటీలు, డిక్లరేషన్లు ఎటు పోయాయి? అని కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, తెలంగాణ ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. కుట్రలు, కుయుక్తులె కాంగ్రెస్ నైజం అని విమర్శించారు. అంతులేని హామీలు, ఆచరణకు సాధ్యంకాని హామీలు, మోసపూరితమైన హామీలు కాంగ్రెస్ ఇచ్చింది.. హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం నిస్సహాయత స్థితిలో ఉండిపోయిందన్నారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి భార్య 15 ఎకరాల ప్రభుత్వ భూమిని తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకుందని ఆరోపించారు. కాంగ్రెస్ బరి తెగించి ప్రవర్తిస్తోందని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అమలు కానీ హామీలిచ్చి పది నెలలో ప్రజల నమ్మకం కోల్పోయిందన్నారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ లో కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు అమలయ్యే సంక్షేమ పథకాలను అటకెక్కించిందన్నా రు. హామీల పేరుతో ప్రజల ఓట్లను కాంగ్రెస్ దండుకుంటుందన్నారు. సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లిఖార్జున్ ఖర్గే ఇచ్చిన గ్యారంటీలు ఎక్కడికిపోయాయి అని కర్ణాటక, తెలంగాణ ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. తెలంగాణలో అమలు అయ్యేది ఒక మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మాత్రమే అన్నారు. అశోక్‌నగర్‌లో నిరుద్యోగ యువత ఆకలి కేకలను పోలీస్ లాఠీలతో అణిచి వేస్తున్నారు. బీఆర్ఎస్‌కు కాంగ్రెస్‌కు తేడా ఏంటో కాంగ్రెస్ నేతలు చెప్పాలన్నారు. ఏడాది కాకముందే దాదాపు లక్ష కోట్ల అప్పు తీసుకుంది. అప్పులు తేవడం కోసం టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారన్నారు. అరకొర రుణమాఫీ చేసి పూర్తిగా చేసినట్లు అబద్ధాలు చెబుతుంది. ఏ పంటకు బోనస్ ఇవ్వలేదు.. సిగ్గు లేకుండా, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలు తెలంగాణలో 31వేల కోట్ల రుణమాఫీ జరిగిందని ప్రచారం చేస్తున్నారన్నారు. 16,41, 428మందికి ఇంకా రుణమాఫీ చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి ఎంత రుణమాఫీ జరిగిందో ప్రజల ముందు పెట్టాలన్నారు. మహిళలకు తులం బంగారం, స్కూటీలు ఎక్కడికిపోయాయో తెలపాలన్నారు. కొండంత హామీలు ఇచ్చి.. ఎలుకంత హామీలను కూడా అమలు చేయలేదు.. దేశానికి కాంగ్రెస్ పార్టీ శనిలా ఉందన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

మెరుగైన ఫర్నిచర్, ల్యాబ్స్‌పై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ప్రైవేటు బడులకు దీటుగా ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు పెరగాలన్నారు. సర్కారు బడుల అభివృద్ధికి సమాజమంతా బాధ్యత తీసుకోవాలని సూచించారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యం కనిపిస్తోందన్నారు దివాళకోరు, దగాకోరు రాజకీయాలు చేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందన్నారు. అమలు కానీ హామీలు ఇవ్వడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని కిషన్ రెడ్డి చురకలంటించారు. ఇచ్చిన హామీలకే గతిలేదని, కొత్తగా మళ్లీ హామీలిస్తున్నారన్నారు. డిక్లరేషన్, గ్యారంటీల పేరుతో గారడీ చేశారని కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు.

## మార్చిలోపు బకాయిలు

- మాజీ సర్పంచులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- మీకు మా ప్రభుత్వం అండా ఉంటుంది
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి
- నాడు మోసం చేసి, నేడు ధర్నాలు బీఆర్ఎస్‌పై మంత్రి ఫైర్
- కేంద్రమంత్రులు రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శలు

**హైదరాబాద్, నవంబర్ 4 :** తెలంగాణలో సర్పంచ్‌లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పెట్టిన బకాయిలకు తాము భరోసా అని అన్నారు. అయితే బకాయిలు చెల్లించని వారే ఆందోళనకు దిగడం విడ్డూరంగా ఉందన్నారు. సర్పంచ్‌ల బకాయిలకు ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుందని, రాజకీయ పార్టీల ట్రాప్‌లో పడవద్దన్నారు. గాంధీభవన్‌లో మంత్రి పొన్నం మీడియా ప్రతినిధులతో నిర్వహించిన ఇష్టాగోష్ఠిలో మాట్లాడారు. సర్పంచులకు మార్చిలోపు బకాయిలు చెల్లిస్తామన్నారు. వంద ఎలుకలు తిన్న పిల్లి మాదిరిగా భారాస నేతలు సర్పంచ్‌ల గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో సర్పంచ్‌ల ఆత్మహత్యలకు కారణమైన వారే.. ఇప్పుడు ధర్నాలు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి విషయం అందరికి తెలుసునని చెప్పారు. కాస్తా ఓపిక పట్టాలని ఈ సందర్భంగా సర్పంచులకు మంత్రి పొన్నం సూచించారు. వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి బకాయిలు చెల్లిస్తామని రైతులకు మంత్రి స్పష్టం చేశారు. సర్పంచుల బకాయిలు చెల్లించేందుకు తమ ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తుందన్నారు. పొలిటికల్ పార్టీల ట్రాప్‌లో పడకండంటూ తెలంగాణలోని సర్పంచులకు ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు పలికారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణకు ఏం చేశారని మంత్రి ప్రశ్నించారు. రాష్ట్రంలో వరదలు సంభవించినప్పుడు రూ.10 వేల కోట్ల నష్టం వాటిల్లితే.. కేంద్రం కేవలం రూ.400 కోట్లే ఇచ్చిందని మండిపడ్డారు. రాష్ట్రంలో వరద నష్టంపై నివేదికను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు తమ ప్రభుత్వం అందజేసిందని గుర్తు చేశారు. అయితే వరదల వల్ల రూ. 10 వేల కోట్ల నష్టం జరిగితే.. కేంద్రం మాత్రం కేవలం రూ. 4 వందల కోట్లు మాత్రమే సాయం చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై పొన్నం ప్రభాకర్ నిప్పులు చెరిగారు. రాష్ట్రం నుంచి మోదీ కేబినెట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తెలంగాణకు ఏం ప్రయోజనాలు చేకూర్చారని ప్రశ్నించారు. కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి మమ్మల్ని ప్రశ్నించే ముందు గత పదేళ్లలో ఏం చేశారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి చేసింది శూన్యమని ఆయన గుర్తు చేశారు. గత దశాబ్ద కాలంలో ఏం చేసిందో చెప్పాలంటూ కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూటిగా సవాల్ విసిరారు. అమర వీరుల స్థూపం వద్ద చర్చకు రావాలని వారిద్దరకు పొన్నం ప్రభాకర్ ఈ సందర్బంగా సూచించారు. ఈ కేంద్ర మంత్రులు ఇద్దరిలో తెలంగాణ డీఎన్ఏ ఉంటే ఏమైనా చేసే వారని.. కానీ వారిలో అది లేదంటూ మంత్రి పొన్నం ఎద్దేవా చేశారు.మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలను బిఅర్ఎస్ పార్టీ రెచ్చకొట్టే కార్యక్రమం ముగిశాక.. వారికి న్యాయం చేయడానికి తాము వెళతామన్నారు.

## భారం పడకుండా ఆదాయం పెంపు

**డిప్యూటి సిఎం మల్లు భట్టి ఆదేశం**



**హైదరాబాద్, నవంబర్ 4 :** ప్రజలపై భారం పడకుండా ఆదాయం పెంచే మార్గాలపై దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన రిసోర్స్ మొబిలైజేషన్ కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లుతో పాటు మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు. జాయింట్ వెంచర్స్‌లో విలువైన ఆస్తులు ఉన్నాయి.. ప్రైవేట్ వ్యక్తులు కోర్టుకు వెళ్లి వివాదాలు సృష్టిస్తున్నారన్నారు. ఈ అంశంపై నలుగురు ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావు అధ్యక్షతన మున్సిపల్, హౌసింగ్, లా సెక్రెటరీలతో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కమిటీ సమావేశమై వారంలోగా సమస్యకు పరిష్కారం అయ్యేలా ప్రణాళికలు రూపొందించాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. రాజీవ్ స్వగృహ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న ఎ÷–లాట్ల స్థితిగతులను సబ్ కమిటీ సమీక్షించింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో 5 ఎకరాల విస్తీర్ణంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఇండస్ట్రియల్ పార్కు నిర్మించాలని పరిశ్రమల శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.



## ఆర్య వైశ్య సంఘం దమ్మాయిగూడ మున్సిపల్ అధ్యక్షులుగా

# సీనియర్ జర్నలిస్ట్ గాదె రాము ఎన్నిక



**కీసర, నవంబర్ 4 (నేటి ప్రస్థానం) :** ఆర్య వైశ్య సంఘం దమ్మాయిగూడ మున్సిపల్ అధ్యక్షులుగా సీనియర్ జర్నలిస్ట్ గాదె రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం దమ్మాయిగూడ సిద్ధార్థ నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ లో ఆర్య వైశ్య సంఘం దమ్మాయిగూడ శాఖ సమావేశంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య మహాసభ సభ్యత్వాల వైస్ చైర్మన్ వాస కిరణ్ కుమార్,జిల్లా పిఆర్ఓ కమిటీ చైర్మన్ రేణిగుంట మహేష్ కుమార్,జిల్లా వైస్ ప్రెసిడెంట్ సంతోష్ మంచన,జిల్లా కార్యవర్గ సభ్యులు టి. రమేష్ గుప్తా పాల్గొన్నారు. కమిటీ ఉపాధ్యక్షులుగా బోనుగుల లక్ష్మణ్ రావు, కోశాధికారిగా తొడుపునూరి వినేష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా మంచాల చంద్ర శేఖర్, సంయుక్త కార్యదర్శిగా టి.రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రేపల్లె రమేష్,వర్కింగ్ ప్రెసిడెంట్ గా మోటమర్రి ప్రవీణ్ కుమార్, సలహాదారులుగా సారపు శ్రీనివాస్,సి. నాగరాజ్, కార్యవర్గ సభ్యులుగా గొల్ల శివ కుమార్,విజయ్ కుమార్ గుప్తా, ఉపాధ్యక్షులుగా చింతా కరుణాకర్, పూర్ణ చందర్, రాజా నాగేంద్రలను ఎన్నుకున్నారు.

# నేడు నగరానికి వస్తున్న రాహుల్

- 400 మంది ప్రతినిధులతో ఇంటరాక్షన్
- కులగణనపై చర్చించే ఛాన్స్



**హైదరాబాద్, నవంబర్ 4 :** ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం హైదరాబాద్ రానున్నారు. బోయిన్ పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్ లో మేధావులతో జరిగే సమావేశంలో పాల్గొంటారు. దాదాపు 400 మంది వివిధ వర్గాల వారితో ఇంటరాక్ట్ అవుతారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా తెలంగాణలో కులగణన ఈ నెల 6 నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో వివిధ వర్గాలతో ఇంటరాక్ట్ అయ్యేందుకు రాహుల్ వస్తున్నారు. కులగణన వాస్తవ పరిస్థితులపై మేధావులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నేతలతో భేటీ అవుతారు. ట్రాన్స్ జెండర్లు, మహిళలతోనూ ముచ్చటిస్తారు. కులగణన ఎలా చేయాలనే అంశాలపై వారితో చర్చిస్తారు. సాయంత్రం 4.45 గంటలకు ఆయన ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్ పోర్టుకు చేరుకుటారు. అక్కడి నుంచి సాయంత్రం 5 గంటలకు బోయిన్ పల్లి బయల్దేరుతారు. 5.20 గంటలకు అక్కడికి చేరుకొని 5.30 గంటల నుంచి 6.30 వరకు ష్ట్రంలో అమలు చేయనున్న కుల గణనపై వివిధ వర్గాల, వివిధ రంగాల వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తారు. 7.10 లకు బేగంపేటకు చేరుకొని ఢిల్లీ బయల్దేరి వెళ్తారు.

# అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు

- కేంద్రాలకు ఉచిత విద్యుత్
- అంగన్‌వాడీ టీచర్లు,హెల్పర్లతో మంత్రి సీతక్క భేటీ
- చీరల ఎంపికపై చర్చ



**హైదరాబాద్, నవంబర్ 4 :** అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు నిర్మిస్తామని, అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్ అందిస్తామని మంత్రి సీతక్క అన్నారు. మహిళలు స్వేచ్ఛగా పనులకు వెళ్లిందుకే క్రష్ లు సహాయపడతాయని, క్రష్ లతో మహిళలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. క్రష్ లతో అంగన్వాడి సిబ్బందికి ఇబ్బందులు లేవని, అంగన్వాడీలకు అనుబంధంగా క్రష్‌లను కొనసాగిస్తామని ఆమె తెలిపారు. అంగన్వాడి సిబ్బంది అంతా చిత్తశుద్ధితో పనిచేయండన్నారు. సచివాలయంలో అంగన్వాడి టీచర్లు, హెల్పర్లతో మహిళా శిశు సంక్షేమ మంత్రి సీతక్క భేటీ అయ్యారు. అంగన్వాడి సిబ్బందికి ఇచ్చే చీరల ఎంపిక కోసం అంగన్వాడి టీచర్లు, హెల్పర్ల అభిప్రాయాలను మంత్రి సీతక్క తెలుసుకుంటున్నారు. గతంతో పోలిస్తే నాణ్యమైన చీరలు ఇవ్వాలని మంత్రికి అంగన్వాడి టీచర్లు విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలోనే.. పలు రకాల డిజైన్ చీరలను చూయించి నచ్చిన చీరను ఎంపిక చేసుకోవాలని అంగన్వాడి టీచర్లను సీతక్క కోరారు. డిజైన్, రంగుల్లో మార్పులు చేయాలని అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు సూచించినట్లు తెలుస్తోంది. వారి సూచనలకు అనుగుణంగా మార్పులు చేసి త్వరలో చీరలు పంపిణీ చేస్తామని సీతక్క చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. అమ్మలాగా చిన్నారుల భవిష్యత్తును తీర్చి దిద్దుతున్న అంగన్వాడి టీచర్లకు ధన్యవాదాలు తెలిపారు. మీ అభిప్రాయాలను తెలుసుకున్న తర్వాతే చీరలు ఇవ్వాలని నిర్ణయించామని, మంచి నాణ్యమైన చీరలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారన్నారు. ఆర్థిక సమస్యలతో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అయినప్పటికీ అంగన్వాడి సమస్యలన్నిటికీ పరిష్కారం చూపిస్తామన్నారు. రిటర్మెంట్ బెనిఫిట్స్ సాంకేతిక సమస్యలు ఆలస్యం అవుతుందని, ఈరోజు ఆర్దిక మంత్రి భట్టి విక్రమార్కతో చర్చించామన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆమె వెల్లడించారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ పది రోజుల్లో జీవో వస్తుందని, అంగన్వాడి సమస్యలను ప్రయారిటీ గా పరిష్కరిస్తున్నామన్నారు. మంత్రి హామీతో క్రష్ లను స్వాగతిస్తున్నామని అంగన్వాడీ టీచర్లు వెల్లడించారు.

## ఇచ్చిన హామీలపై

# సమాధానం చెప్పండి

### హింసించే పులకేశిలా రేవంత్ ప్రభుత్వం

### రాహుల్ రాకతో కేటీఆర్ బహిరంగం లేఖ



**హైదరాబాద్, నవంబర్ 4 :** సీఎం రేవంత్ హింసించే రాజు పులకేశిలా తయారైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు విమర్శించారు. ఇచ్చిన ఒక్క హామీని సైతం నిలబెట్టకోకుండా ప్రజలను మోసం చేశారని.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను హింసించే పులకేసి మాదిరిగా హింసిస్తుంటే.. ఏం తెలియనట్లుగా నటిస్తూ ఢిల్లీలో గప్‌చుప్ అయి-ంపోయారని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో ఆయనకు కేటీఆర్ సోమవారం బహిరంగ లేఖ రాశారు. అధికారం కోసం అడ్డగోలు హామీలిచ్చి, సబ్బండ వర్గాలకు చేసిన మోసం, అభివృద్ధి తెలంగాణను అవినీతి తెలంగాణగా మార్చినందుకు కాంగ్రెస్ పార్టీ తరఫున యావత్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని రాహుల్ గాంధీని కేటీఆర్ డిమాండ్ చేశారు. పదేళ్లలో ఘనంగా అభివృద్ధి చెందిన తెలంగాణకు విచ్చేస్తున్న రాహుల్ గాంధీకి.. పచ్చగా ఉన్న తెలంగాణ మీ ఏడాది పాలనలోనే ఏ విధంగా వందేళ్ల విధ్వంసానికి గురైందో మీ రాక సందర్భంగా ఒక్కసారి మీకు గుర్తు చేయదలచుకున్నా నన్నారు. ఎన్నికలకు ముందు తెలంగాణలో ఏ పిల్లాడికి కూడా కష్టమొచ్చిన సరే ఇలా పిలుస్తే అలా వస్తానని చెప్పి.. తీరా గద్దెనెక్కిన తర్వాత మా ప్రజల గొంతును తడిగుడ్డతో కోశారని ధ్వజమెత్తారు. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆటోడ్రైవర్లు, చేనేత కార్మికులు, మూసీ, హైడ్రా బాధితులు ఇలా ఒక్కరంటే సమాజంలో అన్ని వర్గాలను నయవంచనకు గురిచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో వచ్చిన మరుసటి రోజు నుంచే మీ నయవంచన స్వరూపం ఎలా ఉంటుందో ప్రజలకు రుచి చూపించారని కేటీఆర్ ధ్వజమెత్తారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అంటూ ఊదరగొట్టి మూడు వందల రోజులు దాటినా సరే వాటిని అమలు చేయటం చేతకాక చేతులెత్తేశారని ఆరోపించారు. కాంగ్రెస్ కబంధ హస్తల్లో చిక్కుకొని తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు విలవిలలాడుతోందని.. అభయహస్తమని నమ్మబలికి భస్మాసుర హస్తంతో తెలంగాణ ప్రజలను నిండా ముంచారని.. అన్నారు. ఆరు గ్యారంటీలు, అభయ హస్తం అంటూ ఇక్కడి ప్రజలను మోసం చేసేందుకు ముందుగా ఢిల్లీ నుంచి వచ్చి నాంది పలకింది రాహుల్ గాంధీయేనని.. యథా రాజా తథా ప్రజా.. అన్న తరహాలోనే మీ బాటలోనే తెలంగాణ నాయకులు నడుస్తున్నారని విమర్శించారు. ఆరు గ్యారంటీల అమలు బాధ్యత నాది అని చెప్పారని.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటువైపు తొంగి కూడా చూడలేదని విమర్శించారు. మూడు వందల రోజులైనా ఒక పరిమిత ఉచిత బస్ మినహా ఒక్క గ్యారంటీని అమలు చేయలేని అసమర్థత అని.. రైతులకు రుణమాఫీ అని చెప్పి సగం మందికి కూడా రుణాలు మాఫీ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ, హైడ్రా పేరుతో పేద, మధ్య తరగతి ప్రజల పొట్ట కొడుతున్నాడు. హైడ్రా, మూసీ పేరు చెబితినే ప్రజలు హడలిపోయే పరిస్థితి తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు గూడు కట్టిస్తామంటూ నమ్మబలికి వాళ్ల గూడును చెదరగొట్టిన గొప్ప పాలన మీ ప్రభుత్వానిది. అశోక్‌నగర్‌లో నిరుద్యోగుల దగ్గరకు వెళ్లేందుకు రాహుల్ గాంధీకి దమ్ముందా ? సవాల్ విసిరారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులు, రక్షణ కల్పిస్తున్న పోలీసులు, మూసీ, హైడ్రా బాధితులను, ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికులు, ఆటో డ్రైవర్లు.. అసలు తెలంగాణ ప్రజల ముందుకు వచ్చేందుకు రాహుల్ గాంధీకి దమ్ముందా? అని ప్రశ్నించారు.

# పెండింగ్ బిల్లుల కోసం చలో హైదరాబాద్

- ఎక్కడికక్కడే మాజీ సర్పంచ్‌ల అరెస్ట్
- మద్దతుగా బిఆర్ఎస్ నేతల ఆందోళన
- హరీష్ రావు తదితరుల అరెస్ట్
- అరెస్ట్‌లను ఖండించిన కేటీఆర్ తదితరులు





**హైదరాబాద్, నవంబర్ 4 :** పెండింగ్ బిల్లులు విడుదల చేయాలంటూ తెలంగాణలో మాజీ సర్పంచులు పోరుబాట పట్టారు. సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చేందుకు హైదరాబాద్ చేరుకుని ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. అనంతరం హోటల్ బయటకు వచ్చిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఛలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చారు.మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టిన వారిని ఎక్కడికక్కడ పోలీసులు అరెస్ట్ చేశారు. తమ సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి వెళ్లి వినతి పత్రం ఇవ్వనున్నామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా మాజీ సర్పంచులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టులు చేసారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో సమావేశమైన మాజీ సర్పంచులను అదుపులోకి తీసుకున్నారు. దీంతో రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, రాష్ట్ర ఉపాధ్యాక్షులు గుండి మధుసూదన్ రెడ్డి, రేపాక నాగయ్య, గుర్రాలదండి ఆంజనేయులు, దుంప ఆంజనేయులుతోపాటు పలువురు మాజీ సర్పంచులను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా ధరాకు మద్దుతగా వచ్చిన మాజీ మంత్రి హరీశ్ రావును అరెస్ట్ చేశారు పోలీసులు. మాజీ సర్పంచులకు మద్దతుగా తిరుమలగిరి పీఎస్ ముందు రోడ్డుపైన హరీశ్ రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు మండలి ప్రతిపక్ష నేత మధుసూధనాచారి, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ సంజయ్ తోపాటు పలువురు నిరసనకు దిగారు. దీంతో పోలీసులు వాళ్లను పీఎస్ కు తరలించారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ ఛలో హైదరాబాద్‌కు మాజీ సర్పంచ్ లు పిలుపునిచ్చారు. అయితే హైదరాబాద్ కు వెళ్లకుండా మాజీ సర్పంచ్ లను ముందస్తుగా అరెస్ట్ చేశారు పోలీసులు . జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్న పలువురు మాజీ సర్పంచులను అరెస్ట్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్లకు తరలించారు. మాజీ సర్పంచుల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సీఎంను కలిసేందుకు వచ్చిన వారిని అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. గ్రామాభివృద్ధి కోసం ఖర్చు చేసిన డబ్బు ఇవ్వాలని కోరితే అరెస్టులు చేస్తారా అని ప్రశ్నించారు. వారంతా అప్పులు తెచ్చి, ఆస్తులు అమ్మి, భార్యాపిల్లల బంగారం తాకట్టు పెట్టారన్నారు. ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన మాజీ సర్పంచులను అరెస్టు చేయడమేనా?అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తారు.. సర్పంచులకు చెల్లించరా? అని నిలదీశారు. మాజీ సర్పంచులను వెంటనే విడుదల చేయాలని.. బిల్లులు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ పోరుబాటకు పిలుపునిచ్చిన మాజీ సర్పంచ్‌లను రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో మాజీ మంత్రి పోస్టు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని హైదరాబాద్‌కు వస్తే వారిని అడ్డుకోవడం, అక్రమంగా నిర్బంధించడం అప్రజాస్వామికమన్నారు. అప్పులు తెచ్చి, ఆస్తులు అమ్మి, భార్యా పిల్లల మీద ఉన్న బంగారం కుదువ పెట్టి గ్రామ అభివృద్ధి కోసం చేసిన డబ్బులు ఇవ్వాలంటే ప్రభుత్వం అరెస్టులు చేస్తోందని మండిపడ్డారు.ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన సర్పంచ్‌లను అరెస్టులు చేయడమేనా అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ, చిన్న పనులు చేసిన మాజీ సర్పంచ్‌లకు మాత్రం బిల్లులు చెల్లించక పోవడంలో ఆంతర్యం ఏమిటని నిలదీశారు. అక్రమంగా నిర్బంధించిన, అరెస్టులు చేసిన మాజీ సర్పంచ్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్ బిల్లులను తక్షణం చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హరీష్‌రావు ఎక్స్‌లో పోస్టు చేశారు. పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచులు ఏడాదిగా తిరుగుతున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. వారి కుటుంబాలను రోడ్డున పడేయడం దారుణమని పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న వారిని ఎందుకు అరెస్టు చేస్తున్నారని ప్రశ్నించారు. పల్లె ప్రగతి పేరుతో తాము చేపట్టిన కార్యక్రమానికి తూట్లు పొడిచారని కేటీఆర్ ఆరోపించారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్న మాజీ సర్పంచులను అరెస్టు చేయడాన్ని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఖండించారు. ప్రజాపాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్, రేవంత్ సర్కార్ ఉదయం 4 గంటలకే వారిని అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లలో బందించడం హేయమైన చర్య అన్నారు. అప్పులు తెచ్చి చేసిన పనులకు బిల్లులు అడిగితే అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు చేసిన పనులకే డబ్బులు ఇవ్వమంటే ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు ఇంత కోపమొచ్చిదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌కు మాజీ సర్పంచులంటే ఎందుకింత కోమని విమర్శించారు. చిన్న కాంట్రాక్టర్లకు చెల్లించేందుకు డబ్బులు ఉండవు కానీ, బడా కాట్రాక్టులకు కమిషన్ల కోసం బిల్లులు చెల్లించేందుకు డబ్బులు ఉంటాయన్నారు. సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించడానికి డబ్బులు లేవు కానీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజగోపాల్ రెడ్డిలకు ఇవ్వడానికి, రూ.లక్షన్నర కోట్లతో మూసీ ప్రాజెక్ట్ చేపట్టడానికి రేవంత్ రెడ్డి దగ్గర డబ్బు ఉందని మండిపడ్డారు. పది నెలలుగా అడుగుతున్నా బిల్లులు చెల్లించకుండా సర్పంచ్‌లను ప్రభుత్వం వేధిస్తున్నదని చెప్పారు. ఇప్పటికే గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది, పారిశుద్ధ్యం పడకేసిందని విమర్శించారు. మాజీ సర్పంచ్‌ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.





నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక
మంగళవారం 5 నవంబర్ 2024




# మెగా వేలానికి వేదిక ఫిక్స్..

ఇటీవల, ఐపిఎల్ 2025 మెగా వేలానికి ముందు, అన్ని ఫ్రాంచైజీలు తమ రిటెన్షన్ జాబితాలను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఐపీఎల్ వేలం తేదీ, వేదిక గురించి కీలక అప్‌డేట్ వచ్చింది. తాజాగా వినిపిస్తోన్న సమాచారం ప్రకారం రియాద్‌లో వేలం నిర్వహించను న్నారు. వేలం వేదికగా రియాద్‌ను బీసీసీఐ ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఐపీఎల్ మెగా వేలం నవంబర్ చివరి వారంలో నిర్వహించే అవకాశం ఉంది. ఈ సమయంలో భారతదేశంలో పండుగ, వివాహాల సీజన్. ఈ కారణంగా వేలం నిర్వహించడానికి బిసిసిఐ విదేశాల్లో ప్లాన్ చేసినట్లు వినిపించాయి. భారతదేశంలో కూడా, బోర్డు కొన్ని ప్రాంతాలను ఎంచుకుంది. కానీ పండుగ, పెళ్లిళ్ల సీజన్ కారణంగా, హోటళ్లు అందుబాటులో లేవు. సౌదీ అరేబియాలోని రెండు నగరాలు, రియాద్, జెద్దాలో ఎంపికలను అన్వేషిస్తోంది. ఎంపికలను అన్వేషించడానికి బోర్డు సౌదీ అరేబియాకు బృందాలను కూడా పంపింది. బీసీసీఐ అధికారులు రెండు నగరాలను సందర్శించారు. ఆ తర్వాత రియాద్‌ను ఖరారు చేశారు. వేలం తేదీ గురించి మాట్లాడితే, దీనిని నవంబర్ 24న నిర్వహించవచ్చు అని తెలుస్తోంది. అందరి చూపు ఐపీఎల్ మెగా వేలం పైనే ఉంది. ఎందుకంటే ఈ వేలంలో అన్ని ఫ్రాంచైజీలు కొత్త జట్టును సిద్ధం చేస్తాయి. ఇటీవల అన్ని ఫ్రాంచైజీలు కొంత మంది ఆటగాళ్లను రిటైన్ చేసి మిగిలిన వారిని విడుదల చేశాయి. రిషబ్ పంత్, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్, మిచెల్ స్టార్క్, మహ్మద్ సిరాజ్, యుజ్వేంద్ర చాహల్, మహ్మద్ షమీ, గ్లెన్ మాక్స్‌వెల్, ఇషాన్ కిషన్‌లతో సహా చాలా మంది పెద్ద పేర్లు వేలంలో కనిపించనున్నాయి. ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్‌జెయింట్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ సహా పలు జట్లు ఇప్పుడు కొత్త కెప్టెన్ కోసం వెతుకుతున్నాయి. ఫ్రాంచైజీలు నిలుపుదలలో అనేక ఆశ్చర్యకరమైన నిర్ణయాలు తీసుకున్నాయి. ధృవ్ జురెల్, రింకూ సింగ్, మతీషా పతిరానాతో సహా కొంతమంది ఆటగాళ్లకు ఊహించని ప్రైజ్ మనీ దక్కింది. జురెల్ జీతం రూ.20 లక్షల నుంచి రూ.14 కోట్లకు పెరిగింది. కాగా, రింకూ ఆదాయం రూ.55 లక్షల నుంచి రూ.13 కోట్లకు పెరిగింది. పతిరానా జీతం రూ.20 లక్షల నుంచి రూ.13 కోట్లకు, మయాంక్ యాదవ్, రజత్ పటీదార్ల జీతం రూ.20 లక్షల నుంచి రూ.11 కోట్లకు పెరిగింది.

# టీమిండియా ఓటమిపై
## ప్రశ్నలు సంధించిన క్రికెట్ గాడ్..




న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌లో ఓటమిని భారత్‌లో ఎవరూ జీర్ణించుకోలేకపోతున్నారు. ఆటగాళ్ల ప్రదర్శనపై అభిమానులు, పలువురు భారత అనుభవజ్ఞులు ప్రశ్నలు సంధిస్తున్నారు. క్రికెట్ దేవుడుగా పేరుగాంచిన సచిన్ టెండూల్కర్ కూడా ఈ అవమానకరమైన ఓటమి తర్వాత తనను తాను ఆపుకోలేకపోయాడు. సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేస్తూ టీమిండియా ఆటతీరుపై ఘాటుగా స్పందించాడు. ఈ సిరీస్‌లో ఓడిపోవడంపై సచిన్ 3 పెద్ద ప్రశ్నలను అడిగాడు. అయితే, ఈ మ్యాచ్‌లో జట్టును నిలబెట్టడానికి తమ శాయశక్తులా ప్రయత్నించిన శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్‌లను కూడా అతను ప్రశంసించాడు. టీమిండియా అవమానకరమైన ఓటమి గురించి మాట్లాడితే, సచిన్ టెండూల్కర్ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ శలో ఒక పోస్ట్‌ను పంచుకున్నారు. 'హోమ్ గ్రౌండ్‌లో 3-0తో ఓడిపోవడం చాలా కష్టం. ఆత్మపరిశీలన అవసరం అంటూ రాసుకొచ్చాడు. అలాగే, 'ఇది ప్రిపరేషన్ లోపమా, పేలవమైన షాట్ ఎంపికనా, లేదా మ్యాచ్ ప్రాక్టీస్ లోపమా?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో శుభ్‌మన్ గిల్ 90 పరుగులు చేయగా, పంత్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ హాఫ్ సెంచరీలు సాధించాడు. ఈ ఆటగాళ్లను ప్రశంసిస్తూ, సచిన్ 'శుభ్మన్ గిల్ మొదటి ఇన్నింగ్స్‌లో ఫ్లెక్సిబిలిటీని కనబరిచాడు. రిషబ్ పంత్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అద్భుతంగా ఆడాడు. అతని ఫుట్‌వర్క్ మైదానాన్ని పూర్తిగా భిన్నంగా చేసింది. అతను నిజంగా అద్భుతంగా ఉన్నాడు' అంటూ చెప్పుకొచ్చాడు. సచిన్ టెండూల్కర్ తన పోస్ట్‌లో న్యూజిలాండ్ జట్టుపై ప్రశంసలు కురిపించాడు. 'సిరీస్ అంతటా స్థిరమైన మంచి ప్రదర్శన కోసం పూర్తి క్రెడిట్ న్యూజిలాండ్‌కు చెందుతుంది. భారత్‌లో 3-0తో గెలవడం అత్యుత్తమ ఫలితం. న్యూజిలాండ్ తన క్రికెట్ చరిత్రలో తొలిసారిగా భారత్‌లో టెస్ట్ సిరీస్‌ను గెలుచుకుంది. అదే సమయంలో, ఒక జట్టు తన సొంత మైదానంలో 3 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో భారత్‌ను క్లీన్ స్వీప్ చేయడం ఇదే తొలిసారి.

# రిటైర్మెంట్ ప్రకటించిన టీమిండియా క్రికెటర్



భారత వికెట్ కీపర్-బ్యాటర్ వృద్ధిమాన్ సాహా అన్ని రకాల క్రికెట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. ప్రస్తుతం జరుగుతున్న రంజీ ట్రోఫీ సీజన్ తన చివరి సీజన్ అని వృద్ధిమాన్ సోషల్ మీడియా పోస్ట్ ద్వారా తెలియజేశాడు. ఈ స్టంపర్ 40 టెస్టులు, 9 వన్డేల్లో భారత్ తరపున ఆడాడు. ధోనీ, పంత్ తర్వాత భారత్ తరఫున అత్యధిక సెంచరీలు సాధించిన కీపర్‌లలో వృద్ధిమాన్ సాహా రెండో స్థానంలో ఉన్నాడు. సాహా తన కెరీర్‌లో మూడు సెంచరీలతో 1353 టెస్ట్ పరుగులు చేశాడు. సాహా తన చివరి టెస్టులో మూడేళ్ల క్రితం అంటే 2021లో న్యూజిలాండ్‌పై ఆడాడు. సిరీస్‌లో కొన్ని కీలకమైన నాక్‌లు ఆడినప్పటికీ, ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్, కెప్టెన్ రోహిత్ శర్మలతో కూడిన అప్పటి కొత్త టీమ్ మేనేజ్‌మెంట్, రిషబ్ పంత్ బ్యాకప్‌గా కెఎస్ భరత్‌పై దృష్టి సారించి సాహాను జట్టు నుండి తొలగించాలని నిర్ణయించుకుంది. సాహా ఈ నెలాఖరులో జరగనున్న మెగా వేలం కోసం నమోదు చేసుకోకపోవడంతో వచ్చే ఏడాది ఐపిఎల్ లో పాల్గొనే అవకాశం లేదు. అతను ఈ విషయాన్ని బహిరంగంగా ప్రస్తావించనప్పటికీ, వేలానికి ముందు దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన విడుదల కావచ్చని తెలుస్తుంది. సాహా గత మూడేళ్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్న గుజరాత్ టైటాన్స్ ఫ్రాంఛైజీ అతని రిటైన్ చేసుకోలేదు. కోల్‌కతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే), పంజాబ్ కింగ్స్ , సన్‌రైజర్స్ హైదరాబాద్, ఐదు ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహించి, 2008లో ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుండి ప్రతి సీజన్‌లో పాల్గొన్న అతి కొద్ది మంది ఆటగాళ్లలో సాహా ఒకరు కావడం విశేషం.

# కేఎల్ రాహుల్‌కు
## బీసీసీఐ అగ్ని పరీక్ష..

న్యూజిలాండ్‌తో సిరీస్ ఓటమి తర్వాత టీమిండియా టెస్టు జట్టులో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకున్నాయి. ఆస్ట్రేలియాతో జరిగే బోర్డర్-గవాస్కర్ టెస్టు సిరీస్‌కు ఎంపికైన కేఎల్ రాహుల్‌ను ఇప్పుడు ఇండియా ఎ జట్టుకు ఆడమని చెప్పినట్లు సమాచారం. మెల్‌బోర్న్‌లో భారత్ %ూ% జట్టు ఆస్ట్రేలియా తో టెస్ట్ సిరీస్ ఆడుతోంది. ఈ సిరీస్‌లోని రెండవ మ్యాచ్‌కు ముందు భారతదేశం జట్టును సమీకరించాలని బిసిసిఐ కెఎల్ రాహుల్, వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ ధృవ్ జురెల్‌ను ఆదేశించినట్లు తెలిసింది. అందుకే, టీమ్ ఇండియాకు వెళ్లే ముందు కేఎల్ రాహుల్, ధృవ్ జురెల్ ఆస్ట్రేలియా వెళ్లనున్నారు. నవంబర్ 22 నుంచి పెర్త్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా మధ్య టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌కు ముందు, కెఎల్ రాహుల్‌ను ఆస్ట్రేలియా ఎతో ఆడాలని చెప్పారు. అలాగే వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ ధృవ్ జురెల్ కూడా ఇండియా ఎ జట్టులో చేరాలని సూచించాడు. ఈ ఇద్దరు ఆటగాళ్లు న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో భాగంగా ఉన్నారు. అయితే కేఎల్ రాహుల్ తొలి టెస్టు మ్యాచ్‌లో మాత్రమే కనిపించాడు. రిషబ్ పంత్ మోకాలి నొప్పితో బాధపడుతున్నప్పుడు ధృవ్ జురెల్ వికెట్ కీపింగ్ బాధ్యతలు నిర్వర్తించాడు. ఇప్పుడు వీరిద్దరినీ ఇండియా ఎ జట్టులోకి తీసుకోవాలని బీసీసీఐ నిర్ణయించింది. నవంబర్ 7 నుంచి భారత్ ఎ, ఆస్ట్రేలియా ఎ జట్ల మధ్య 4 రోజుల టెస్టు మ్యాచ్ ప్రారంభం కానుంది. దీంతో కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్ మంగళవారం ఉదయం ఆస్ట్రేలియా వెళ్లే అవకాశం ఉంది. తద్వారా వారు సమయానికి అక్కడికి చేరుకోవచ్చు. ఒకవేళ కెఎల్ రాహుల్ భారత్ ఎ జట్టుకు ఆడటంలో విఫలమైతే, అతడిని టెస్టు జట్టు నుంచి తప్పిస్తారా? ఎందుకంటే ఆసీస్ పిచ్‌పై భారత్ ఎ జట్టు ఆటగాళ్లు మంచి ప్రదర్శన చేశారు. అందువల్ల బోర్డర్-గవాస్కర్ టెస్టు సిరీస్‌కు ముందే కేఎల్ రాహుల్‌కు అగ్నిపరీక్ష ఎదుర్కొనబోతున్నాడు. అయితే ప్రాక్టీస్ కోసమే కేఎల్ రాహుల్ ను ఇండియా ఏ జట్టులో ఆడమని ఆదేశాలు ఇచ్చినట్లు బీసీసీఐ చెబుతోంది.




# యువ పంచ్‌కు 17 పతకాలు




అండర్-19 ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ షిప్స్‌లో యువ భారత్ అదరగొట్టింది. టీమ్ ఇండియా నుంచి పోటీల్లో 19 మంది బాక్సర్లు బరిలోకి దిగగా.. ఏకంగా 17 బాక్సర్లు పతకాలు కొల్లకొట్టారు. కృష్ణ వర్మ పసిడితో మెరువగా.. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో మరో ముగ్గురు బాక్సర్లు స్వర్ణాలు సాధించారు. మహిళల 65 కేజీల విభాగంలో పార్థవి గ్రెవల్, మహిళల 80 కేజీల విభాగంలో వెన్సిక గోస్వామి, మెన్స్ 90 కేజీల విభాగంలో హేమంత్ సంగ్వాన్‌లు పసిడి పంచ్ విసిరారు. మహిళల విభాగంలో నిష (51 కేజీలు), సుప్రియ దేవి (54 కేజీలు), క్రితిక వాసన్ (80 కేజీలు), చంచల్ చౌదరి (48 కేజీలు), అజంలి సింగ్ (57 కేజీలు), విని (60 కేజీలు), ఆకాంశ (70 కేజీలు) సిల్వర్ మెడల్స్ సాధించారు. మెన్స్ విభాగంలో రాహుల్ (75 కేజీలు) రతజంతో మెరువగా.. రిషి సింగ్ (50 కేజీలు), క్రిశ్ పాల్ (55 కేజీలు), సుమిత్ (70 కేజీలు), ఆర్యన్ (85 కేజీలు), లక్ష్యరు (90 కేజీలు) కాంస్య పతకాలు దక్కించుకున్నారు. వరల్డ్ బాక్సింగ్ నిర్వహించిన తొలి టోర్నమెంట్‌లో పతకాల పంట పండిరచిన భారత్ మహిళల విభాగంలో ఓవరాల్ రన్నరప్‌గా నిలిచింది.

# భారత క్రికెట్ చరిత్రలోనే
# అత్యంత చెత్త ఏడాది

గత కొన్నేళ్లుగా టెస్టు ఫార్మాట్‌లో టీమిండియా ఆధిపత్యం కొనసాగిస్తోంది. కానీ 2024లో టీమ్ ఇండియా ప్రదర్శన అంచనాల కంటే దారుణంగా ఉంది. భారత జట్టు న్యూజిలాండ్‌తో స్వదేశంలో ఈ ఏడాది చివరి టెస్టు సిరీస్ ఆడింది. అయితే ఈ సిరీస్‌లో భారత ఆటగాళ్లు చాలా అవమాన కరమైన ప్రదర్శన కనబరిచారు. భారత జట్టు 3 మ్యాచ్‌ల్లో ఒక్కటి కూడా గెలవలేక క్లీన్ స్వీప్ చేసింది. న్యూజిలాండ్ భారత్‌కు వచ్చి టెస్టు సిరీస్‌ను గెలవడం క్రికెట్ చరిత్రలో ఇదే తొలిసారి. దీంతో 55 ఏళ్ల తర్వాత భారత్‌లో ఇంత దారుణమైన పరిస్థితి కనిపించింది. ఈ ఏడాది స్వదేశంలో టీమిండి యా మూడు టెస్టుల సిరీస్‌లు ఆడిరది. ఈ ఏడాది తొలి టెస్టు సిరీస్‌లో ఇంగ్లండ్‌తో తలపడిరది. తొలి మ్యాచ్‌లో 28 పరుగుల తేడాతో ఓడిపోయిన భారత జట్టు 4-1తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఆ తర్వాత బంగ్లాదేశ్‌తో 2 టెస్టు మ్యాచ్‌లు ఆడిన భారత జట్టు రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించింది. కానీ, న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమ్ ఇండియాకు ఏదీ అనుకూలంగా లేకపోవడంతో క్లీన్‌స్వీప్‌ను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ ఏడాది స్వదేశంలో టీమ్ ఇండియా మొత్తం 4 టెస్ట్ మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఇది చాలా షాకింగ్ ఫిగర్. భారత క్రికెట్ చరిత్రలో టీం ఇండియా స్వదేశంలో ఏడాది వ్యవధిలో 4 టెస్టు మ్యాచ్‌లు ఓడిపోవడం ఇది రెండోసారి మాత్రమే. ఇంతకుముందు, 1969లో భారత జట్టుతో ఇలాగే జరిగింది.




అప్పుడు కూడా ఆ సంవత్సరంలో భారత జట్టు మొత్తం 4 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. అంటే, 55 ఏళ్ల తర్వాత టీమిండియాకు స్వదేశంలో అలాంటి పరిస్థితి కనిపించింది. ఇది భారత ఆటగాళ్లతో పాటు అభిమానులు కూడా ఎక్కువ కాలం మరిచిపోలేరు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ ఈ నిరాశాజనక ఓటమిని తన కెరీర్‌లో చెత్త దశగా అభివర్ణించాడు.